# వింతవరం

- తిరుమలశ్రీ



కామాక్షికి చిన్నప్పట్నుంచీ దైవభక్తి మెండు. ఆమె భక్తికి మెచ్చి శివుడు ప్రత్యక్షమవుతూ ఉండేవాడు. దైవానుగ్రహం వల్ల కామాక్షికి అనుకూలవంతుడు, ఆస్తిపరుడూ అయిన భర్త లభించాడు. ఆమె జీవితం సుఖమయంగా సాగిపోతోంది.

అయితే సుఖసంతోషాలతో మునిగిపోయిన కామాక్షిలో దైవభక్తి సన్నగిల్లింది. అహం పెరిగింది.

కామాక్షి భర్త వినోదుడికి రత్నాల వ్యాపారం ఉండేది. నిజాయితీపరుడని పేరు తెచ్చుకున్నాడతను.

ఓసారి ఎవరో వ్యక్తి వచ్చి తాను ఆర్థిక దుస్థితిలో ఉన్నానంటూ రత్నాలహారం ఒకటి అమ్మాడు వినోదుడికి. అతను వెళ్లిన కాసేపటికే రాజభటులు వచ్చి వినోదుడి దుకాణాన్ని గాలించడమూ, ఆ రత్నాలహారం కనిపించడమూ జరిగాయి. అది రాణివాసం నుంచి దొంగిలింపబడ్డ హారమని చెప్పి భటులు వినోదుణ్ణి బంధించి రాజు ముందు హాజరుపరిచారు.

తాను నిర్దోషినని వినోదుడు ఎంత మొత్తుకున్నా వినకుండా రాజు అతనికి మరణదండన విధించాడు.

ఆ విషయం ఆలకించిన కామాక్షి మొదలు నరికిన మ్రానులా కూలిపోయింది. ఆ ఆపదనుంచి భర్తను కాపాడమంటూ దేవుడికి మొరపెట్టుకుంది. కాని, ఆమెలో మునుపటి భక్తి లోపించిన కారణంగా దైవానుగ్రహం కలుగలేదు.

కామాక్షికి భర్తంటే పంచప్రాణాలూను. అతను లేని జీవితాన్ని ఊహించుకోలేదామె. అందుకే భర్తను ఉరి తీయకముందే తాను ప్రాణత్యాగం చేసుకోవాలనుకుంది.

ఆ రాత్రి శివాలయానికి వెళ్లింది. "శంకరా! ఒకప్పుడు పిలిస్తే పలికేవాడివి. తలచుకున్నప్పుడు ప్రత్యక్షమయేవాడివి. ఈ జీవితం నువ్వు పెట్టిన భిక్ష. సుఖ సంతోషాలు మరిగి నీ ధ్యాసే మరిచాను. అందుకు ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాను. నా భర్త లేని జీవితం నాకు వద్దు. నన్ను నీలో ఐక్యం చేసేసుకో" అంటూ శివలింగానికి నమస్కరించి చురకత్తితో కడుపులో పొడుచుకోబోయింది.

పిల్లలు తప్పటడుగు వేస్తే వారిని మందలించి సరిజేయడం పెద్దల అలవాటు. అలాగే భక్తులు పెడదారిన పడితే వారికి కనువిప్పు కలిగించి సక్రమ మార్గంలో పెట్టడమే తప్ప వారికి హాని కలిగించడం భగవంతుడి ఉద్దేశ్యం కాదు.

అందుకే శివుడు కామాక్షి ముందు ప్రత్యక్షమయి ఆమె ఆత్మహత్యా ప్రయత్నాన్ని నివారించాడు.

"సుదతీ! భోగభాగ్యాల మాయలో పడి భక్తి మార్గాన్ని అలక్ష్యం చేశావు. అందుకే నీకు ఈ కష్టం వాటిల్లింది. నీ భర్త ఉత్తముడు. అతనికి ఏ హానీ కలగదు. నువ్వు నిశ్చింతగా ఉండు" అంటూ అభయమిచ్చాడు.

కామాక్షిలో అహంకారపు పొరలు మబ్బు తెరల్లా వీడిపోయాయి. శివుడి చరణారవిందాలపైన పడి పశ్చాత్తాపంతో విలపించింది.

శివుడు ఆమెను ఓదార్చి, ఏదైనా వరం కోరుకోమన్నాడు.

కామాక్షి తడుముకోకుండా, "అడపాదడపా మాకు కష్టాలు సంభవించేటట్టు వరమియ్యి" అంది.

శివుడు అచ్చెరువంది, "అదేమి వింతకోరిక, కామాక్షీ?" అనడిగాడు.

అందుకామె "స్వామీ! మేము మానవమాత్రులం. ఎంత కాదనుకున్నా సుఖసంతోషాలు లభించగానే నిన్ను విస్మరిస్తాము. కష్టకాలంలో తప్ప నువ్వు జ్ఞప్తికి రావు. మధ్య మధ్య కష్టాలు కూడా వచ్చినట్లయితే నిన్ను స్మరించుకునే అవకాశమూ, మునుపటిలా నీ దర్శనం చేసుకొనే భాగ్యమూ లభిస్తాయి నాకు. అందుకే అటువంటి వరం కోరాను" అంది భక్తి ప్రపత్తులతో ప్రణమిల్లి.

శివుడు ఆమె నిజాయితీకి మెచ్చి తగు వరాలిచ్చి అదృశ్యమయ్యాడు.

కామాక్షి శివసాక్షాత్కార పారవశ్యంతో ఇంటికి చేరుకొనేసరికి - భర్త వినోదుడు కూడా విడుదలయి వచ్చేశాడు. రత్నాల హారాన్ని దొంగిలించిన అసలు దొంగ దొరకడంతో, వినోదుడి నిర్దోషిత్వం రుజువయి, రాజు అతన్ని విడిచిపెట్టడమే కాక జరిగిన పొరపాటుకు పరిహారంగా విలువైన బహుమతులను ఇచ్చి సత్కరించి పంపాడు.